ప్రభాత
ఉదయం
తెలుగు దినపత్రిక

రాజ్యసభకు నడ్డా, సోనియాల ఎన్నిక ఏకగ్రీవం

2లో..

సంపుటి: 1 | సంచిక: 317 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 21 ఫిబ్రవరి 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్

మేడారంలో.. సందడే సందడి

నేటినుంచి నాలుగురోజుల జాతర

సమ్మక్క, సారలమ్మ జాతర బుధవారం ప్రారంభం కానున్న నేపథ్యంలో.. వనదేవరుడు, సమ్మక్క భర్త పగిడిద్దరాజును, ఆయన తనయుడు జంపన్నను మంగళవారం మేడారం తీసుకెళ్లేందుకు పూజారులు ఏర్పాట్లు చేశారు. గిరిజన సంప్రదాయాలు, శివసత్తుల పూనకాల మధ్య మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలోని దేవాలయం నుంచి పగిడిద్దరాజును, ములుగు జిల్లా కన్నెపల్లి నుంచి జంపన్నను మేడారం తీసుకెళ్లనున్నారు.

2

భారీగా తరలివస్తున్న భక్తులు

పూనుగొండ్ల పగిడిద్దరాజు గుడిలో ప్రత్యేక పూజలు

గద్దెల వద్దకు బయలుదేరిన పగిడిద్దరాజు

భారీగా ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం

ఆర్టికల్ 370 రద్దుతో..

రాష్ట్రంలో నవ్యపథం

దశాబ్దాలుగా వారసత్వ రాజకీయాల్లో మగ్గిన కాశ్మీర్

కాశ్మీర్‌లో పలు అభివృద్ధి పనులకు మోడీ శ్రీకారం

2

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా

పీపుల్స్ పల్స్ - సౌత్ ఫస్ట్ సర్వే

హైదరాబాద్. ఫిబ్రవరి, 20 (ప్రభాత ఉదయం): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల మాదిరిగానే లోక్ సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ హవా కొనసాగుతుందని సర్వేలు చెబుతున్నాయి. లోక్ సభ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా బిజెపి సత్తాచాటినా తెలంగాణలో మాత్రం అత్యధిక ఎంపీ సీట్లు హస్తంపార్టీ హస్తగతం అవుతాయని సర్వేసంస్థలు అంచనా వేస్తున్నారు. తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పై నమ్మకంతో వున్నారని... అది లోక్ సభ ఎన్నికల్లో మరోసారి బయటపడతుందని అంటున్నారు. ఇలా పీపుల్స్ పల్స్ - సౌత్ ఫస్ట్ సర్వే సంస్థ తెలంగాణలో లోక్ సభ ఎన్నికల ఫలితం ఎలా వుండనుందో ప్రకటించింది. తెలంగాణలో ఇటీవల జరిగిన ..మిగతా 2లో

మూడు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం

కాంగ్రెస్-2, బీఆర్ఎస్-1

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 20 (ప్రభాత ఉదయం): రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రం ముగిసింది. రాష్ట్రంలో 3 స్థానాలకు కాంగ్రెస్ నుంచి ఇద్దరు, బీఆర్ఎస్ నుంచి ఒకరు బరిలో నిలవగా.. ఎన్నిక ఏకగ్రీవమైంది. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే శ్రమజీవి పార్టీ తరపున జాజుల భాస్కర్, భోజరాజు కోయల్కర్, స్వతంత్ర అభ్యర్థిగా కిరణ్ రాథోడ్ లు నామినేషన్లు ఇచ్చారు. అయితే, రాజ్యసభ అభ్యర్థిగా పోటీ చేయాలనుకునే ఒక్కో అభ్యర్థికి కనీసం 10 మంది ఎమ్మెల్యేలు సంతకాలు చేయాల్సి ఉంటుంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులకు మినహా మిగిలిన ముగ్గురికీ మద్దతుగా ఎమ్మెల్యేలెవరూ సంతకాలు చేయలేదు. ఈ క్రమంలో ఆ ముగ్గురి నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించనున్నారు. రేణుకాచౌదరి రాజకీయాల్లో ఫైర్ బ్రాండ్ గా పేరు పొందారు. 1984లో టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చిన ఆమె.. 1986లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కు జరిగిన ఎన్నికల్లో బంజారాహిల్స్ నుంచి కార్పొరేటర్ గా గెలిచారు. 1986 నుంచి 98 వరకూ రెండుసార్లు రాజ్యసభ సభ్యురాలిగా పని చేశారు. 1999, 2004లో ఖమ్మం లోక్ సభ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. హెచ్ డీ దేవెగౌడ ..మిగతా 2లో

మళ్లీ రైతుల

ఆందోళనలు

పోలీసుల టియర్ గ్యాస్‌కు కౌంటర్‌గా ఇనుప కవచాలు, జూట్ బ్యాగులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 20 (ప్రభాత ఉదయం): కేంద్ర ప్రభుత్వం తమ డిమాండ్లకు ఒప్పుకోకపోవడంతో అన్నదాతలు మళ్లీ తమ ఢిల్లీ ఛలో మెగా మార్చ్‌ను కొనసాగించాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలోనే బుధవారం నుంచి మళ్లీ ..మిగతా 2లో

అమిత్ షాపై కామెంట్స్..

పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 20 (ప్రభాత ఉదయం): ఉత్తరప్రదేశ్ న్యాయస్థానంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. 2018 పరువు నష్టం కేసులో రాహుల్‌కు సుల్తాన్‌పూర్ ప్రత్యేక కోర్టు మంగళవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కర్ణాటక ఎన్నికల సమయంలో 2018 మే 8న బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ.. హోం మంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ నాయకుడు విజయ్ మిశ్రా అనే వ్యక్తి అదే ఏడాది ఆగస్టు 4న పరువు నష్టం కేసు వేశాడు. ఓ పక్క బీజేపీ నిజాయితీ, స్వచ్ఛమైన ..మిగతా 2లో

కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

10 సిలిండర్లు బ్లాస్ట్, 20 గుడిసెలు దగ్ధం

కరీంనగర్, ఫిబ్రవరి, 20 (ప్రభాత ఉదయం): కరీంనగర్ పట్టణంలోని ఆదర్శ నగర్‌లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. 10 సిలిండర్ పేలిపోగా.. 20 గుడిసెలు కాలి బూడిదయ్యాయి. దేవుడికి పెట్టిన దీపం అగ్ని ప్రమాదానికి కారణమైంది. వివరాల్లోకి వెళితే.. ఆదర్శ నగర్ ప్రాంతాంలో కూలీ పనులు చేస్తూ జీవనం సాగించే కొందరు గుడిసెలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే వారందరూ మేడారం జాతరకు వెళ్లేందుకు ..మిగతా 2లో

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ కసరత్తు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 20 (ప్రభాత ఉదయం): ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న లోక్ సభ ఎన్నికలు 2024 త్వరలోనే జరుగబోతున్నాయి. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు రాష్ట్రాల్లో సార్వత్రిక ఎన్నికల కోసం వరుస పర్యటనలు, ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్చి 9 తర్వాత ఏ క్షణమైనా 2024 ..మిగతా 2లో

మేడారంలో.. సందడే సందడి

ములుగు, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం): బుధవారం నాడు కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దె పైకి తీసుకురానున్న నేపథ్యంలో... అమ్మవార్లను దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. అమ్మవార్లకు తులాభరంతో బంగారం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా వడిబియ్యం, చీర, సారెతో పూజలు చేశారు.భక్తులు పూనకాలతో పరవశిస్తు అమ్మవార్ల దీవెనల కోసం గద్దెల వద్దకు చేరుకుంటున్నారు మేడారం జనసందోహంతో ఆధ్యాత్మిక భక్తి భావనతో పులకించి పోతోంది. మహబూబాబాద్ జిల్లాలోని గంగారం మండలం పూనుగొండ్లలో పగిడిద్దరాజు గుడిలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం పగిడిద్దరాజు మేడారం బయలుదేరారు. పగిడిద్దరాజును తీసుకుని కోయ పూజారులు అటవీ మార్గంలో కాలినడకన మేడారంకు బయలుదేరి వెళ్లనున్నారు. రాత్రికి పగిడిద్దరాజు మేడారంకు రానున్నారు. తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన సమ్మక్క – సారలమ్మ మేడారం జాతర ఈనెల 21 నుంచి నాలుగు రోజుల పాటు ఘనంగా జరుగనుంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో రెండేళ్లకోసారి జరుగుతుంది. జాతరకు ఒకరోజు ముందే పగిడిద్దరాజును మేడారంకు తీసుకువస్తారు. అనంతరం సారలమ్మ, గోవిందరాజును గద్దెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 22న సమ్మక్క దేవతను గద్దెకు తీసుకువస్తారు. ఫిబ్రవరి 23న భక్తులు మొక్కులు తీర్చుకుంటారు. ఫిబ్రవరి 24న దేవతల వనప్రవేశం ఉండగా... ఫిబ్రవరి 28వ జాతర పూజలు ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.మంగళవారం ఉదయం పూనుగొండ్ల సమీపంలోని దేవుడి గుట్ట నుంచి పగిడిద్దరాజును తీసుకొచ్చి దేవాలయంలో ప్రతిష్ఠిస్తారు. శాంతి పూజా కార్యక్రమాల అనంతరం పెన్క వంశీయులు పడగ రూపంలో పగిడిద్దరాజును పెళ్లికొడుకుగా సిద్ధం చేసారు. ఆ పడగ రూపాన్ని గ్రామంలో ఊరేగించిన అనంతరం పూనుగొండ్ల అడవుల నుంచి మేడారానికి కాలినడకన తీసుకెళ్లే కార్యక్రమం మొదలు పెట్టారు. పూజారి జగ్గారావుతోపాటు మరో పదిమంది పూజారులు, పలువురు భక్తులు పగడిద్దరాజు వెంట బయలు దేరుతారు. మధ్యలో గోవిందరావుపేట మండలం కర్లపల్లి లక్ష్మీపురం లోని పెన్క వంశీయుల వద్ద మంగళవారం రాత్రి విడిది కల్పిస్తారు. బుధవారం ఉదయాన్నే బయలుదేరి రాత్రి సారలమ్మ చేరుకునే సమయానికి పగిడిద్దరాజును మేడారం గద్దెకు చేరుస్తామని ప్రధాన పూజారులు చెప్పారు. సమ్మక్క తనయుడు, సారలమ్మ సోదరుడైన జంపన్నను కన్నెపల్లి నుంచి పోలెబోయిన వంశస్థులు మేడారం తీసుకు రానున్నారు. పూజారి పోలెబోయిన సత్యం ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్థులు మంగళవారం సాయంత్రం 5 గంటలకు కన్నెపల్లి నుంచి బయలుదేరి రాత్రి 7 గంటలకు మేడారానికి చేరుకుంటారు. ఆ వెంటనే లక్షల మంది భక్తుల మధ్య జంపన్నను గద్దెపై ప్రతిష్ఠిస్తారు. మహాజాతరకు తెలంగాణ నుంచే కాకుండా ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలనుంచి లక్షలాదిగా వచ్చే భక్తులతో మేడారం కుంభమేలాను తలపిస్తుంది. నాలుగు రోజులపాటు గిరిజన సంప్రదాయాల ప్రకారం దీనిని నిర్వహిస్తారు. ఈనెల 21న కన్నెపల్లి నుంచి సారలమ్మను, ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి గోవిందరాజులను పూజారులు తీసుకొచ్చి గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. దీంతో తొలిరోజు ఘట్టం పూర్తవుతుంది. 22న కీలక ఘట్టమైన సమ్మక్కను చిలుకలగుట్ట మీద నుంచి తీసుకొచ్చి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. కుంకుమ భరిణె రూపంలో ఉన్న సమ్మక్క ఆగమనాన్ని చూసి భక్తులు పులకించిపోతారు. పోలీసులు, జిల్లా అధికారుల సమక్షంలో గాల్లోకి కాల్పులు జరిపి ఘన స్వాగతం పలుకుతారు. 23న సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న గద్దెలపై కొలువై భక్తులకు దర్శనమిస్తారు. 24న దేవతల వనప్రవేశం ఉంటుంది.

అందుబాటులోకి 'మై మేడారం' యాప్

మేడారం జాతరకు వెళుతున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాల వివరాలను తెలిపేందుకు ప్రత్యేకంగా 'మై మేడారం' పేరుతో యాప్‌ను రూపొందించినట్లు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మీడియాకు తెలిపింది. జాతరలో కుటుంబ సభ్యులు తప్పిపోయినా, ఇతరత్రా ఏదైనా సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించేందుకు, తాగునీరు, వైద్యసేవలు, వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, స్నాన ఘాట్‌లు తదితర వివరాలన్నీ యాప్‌లో తెలుసుకోవచ్చని వివరించింది.

మేడారంలో అత్యవసర ఆస్పత్రి

మేడారం జాతరకు భక్తులు క్యూ కట్టారు ఇప్పటికే 50 లక్షలకు పైగా మంది భక్తులు మేడారం దర్శించుకున్నారు. బుధవారం నుంచి మేడారం మహాజాతర మొదలు కాబోతుండటంతో భక్తులు పోటెత్తనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా వైద్యఆరోగ్య శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో 50 బెడ్స్ దవాఖాన ఏర్పాటు చేశారు. 30 చోట్ల ఉచిత హెల్త్‌క్యాంప్‌లు నిర్వహిస్తున్నారు. భక్తులకు 24 గంటల పాటు వైద్య సౌకర్యం అందించనున్నారు. అన్ని చోట్లా కలిపి 150 మంది స్పెషలిస్టు డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉన్నారు. జాతర పరిసర ప్రాంతాల్లో 4 బెడ్స్‌తో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ఒక్కో చోట ముగ్గురు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. డాక్టర్లు, ఏఎన్ఎంలు, పారామెడికల్ సిబ్బంది కలిపి రెండు వేల మందికి పైగా జాతరలో డ్యూటీలు నిర్వహిస్తారని డీఎంఅండ్‌హెచ్‌వో అప్పయ్య ప్రకటించారు. అత్యవసరంగా రోగులను తరలించేందుకు 108 అంబులెన్సులు 15 అందుబాటులో ఉంచారు. అలాగే టెంపరరీ బ్లడ్ బ్యాంక్ కూడా ఏర్పాటు చేశారు. మహజాతర సందర్భంగా సరిపోయే బెడ్స్,మెడిసిన్, ఇంజెక్షన్ లను అందుబాటులో ఉంచారు అధికారులు. జాతర సమయంలో ప్రతి రోజు 300 మందికి పైగా ఔట్ పేషంట్లకు ట్రీట్మెంట్ అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఫిడ్స్ , స్పృహ తప్పి పోవడం , ఆల్కహాల్ ఇంటాక్సిక్, తల గాయాలతో హెల్త్ క్యాంపస్ కు వస్తున్నారు బాధితులు.ఎమ్జంగ్÷న్సీ కేసులను ములుగు టౌన్ కు తరలిస్తున్నారు వైద్యులు. ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుండటంతో భక్తులు తమ జాగ్రత్తలో ఉండాలని సూచిస్తున్నారు వైద్యులు. మేడారం జాతర కోసం రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. మౌలిక వసతులు, నిర్వహణ కోసం రూ.105 కోట్లు కేటాయించిన సంగతి తెలిసిందే.

అమ్మవారిని దర్శించుకుంటున్న జడ్పీ చైర్మన్ సరిత తిరుపతయ్య దంపతులు

ఘనంగా ప్రారంభమైన జమ్ములమ్మ అమ్మవారు ఉత్సవాలు

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన జడ్పీ చైర్మన్ సరిత

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం)నడిగడ్డ ప్రజల ఇలవేల్పు జమ్ములమ్మ దేవి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. గద్వాల మండలంలోని శ్రీజమ్ములమ్మ, పరుశరాముని ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా జిల్లా పరిషత్ చైర్ పర్సన్ సరిత పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ఇఓ వారికి పూర్ణకుంభ స్వాగతం పలికారు. శ్రీజమ్ములమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంటా ఆలయ కమిటిచైర్మన గాయిత్రి సతీష్ కుమార్, ఆలయ ఈఓ, నిర్వాహకులు ఉన్నారు. జమ్ములమ్మ బ్రహ్మోత్సవాలు సందర్భంగా మంగళవారం రోజు అమ్మవారిని తీసుకురావడానికి జమ్మిచేడు ఆలయ నిర్వాహకులు గ్రామస్తులు మేళతాళాలతో జమ్ములమ్మ పుట్టినిల్లు అయిన గద్వాల మండలంలోని గుర్రంగడ్డ గ్రామానికి వెళ్లారు. బుధవారం అమ్మవారిని జమ్ములమ్మను ఆలయానికి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు. గ్రామంలో వెలసిన అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. భక్తులకు సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు ఆలయ నిర్వాహణ అధికారి పురేందర్ తెలిపారు. ఈనెల 24న పౌర్ణమి సందర్భంగా జాతర ప్రారంభమవుతుంది.

జమ్ములమ్మకు పోటెత్తిన భక్తులు

జములమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. గర్భాలయంలో ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని భక్తులు పరవశించారు. జమ్ములమ్మ బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభమైన నేపథ్యంలో మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్షేత్రం కిక్కిరిసింది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో పరిసర ప్రాంతాలు రద్దీగా మారాయి.. ఆలయ గదులతో పాటు పరిసరాలలో షామియాలను వేసుకొని నైవేద్యాన్ని సిద్ధం చేసుకొని అమ్మవారికి సమర్పించారు. చీర, రవికతో పాటు వెండి పాదాలు, కడియాలు, బియ్యాన్ని అమ్మవారికి అర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

రాజ్యసభకు నడ్డా, సోనియాల ఎన్నిక ఏకగ్రీవం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి, 20 (ప్రభాత ఉదయం): రాజ్యసభఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సహా సోనియాగాంధీ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నడ్డా గుజరాత్ నుంచి రాజ్యసభకు మంగళవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు గుజరాత్ రాష్ట్రం నుంచి బీజేపీ అభ్యర్థులుగా రాజ్యసభ రేసులో ఉన్న గోవింద్ ధోలకియా, డాక్టర్ జస్వంత్‌సిన్హ్ సలామ్‌సిన్హ్ పార్మార్, మయాంక్ నాయక్ సైతం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నడ్డాతో సహా గెలుచిన నలుగురు బీజేపీ అభ్యర్థులల్లో ధోలకియా అత్యంత సంపన్నుడు. వజ్రాల వ్యాపారి అయిన ధోలకియా తన ఆస్తి విలువ రూ.279 కోట్లుగా డిక్లేర్ చేశారు. జేపీ నడ్డా రూ.9.36 కోట్ల ఆస్తులు కలిగి ఉన్నారు. ఈ అభ్యర్థులు ఎవరిపైనా ఎఫ్ఐఆర్‌లు కానీ, క్రిమినల్ విచారణలకు కానీ లేవని అఫిడవిట్‌లో డిక్లేర్ చేశారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ రాజస్థాన్ నుంచి రాజ్యసభకు మంగళవారంనాడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోనియా గాంధీతో పాటు భారతీయ జనతా పార్టీ నేతలు చున్నీలాల్ గారసియా, మదన్ రాథోడ్‌లు రాజస్థాన్ నుంచి ఎగువ సభకు ఎన్నికైనట్టు అసెంబ్లీ సెక్రటరీ మహావీర్ ప్రసాద్ శర్మ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారంతో ముగిసింది. పోటీలో ఇతర అభ్యర్థులు ఎవరూ లేకపోవడంతో ఈ ముగ్గురు నేతలు పోటీలేకుండానే ఏకగ్రీవంగా పెద్దలసభకు ఎన్నికయ్యారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే హవా

మొదటి పేజీ తరువాయి...

అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే లోక్ సభ ఎన్నికల్లో బిజెపి ఓట్లు గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయని పీపుల్స్ సర్వే తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల కంటే 9 శాతం ఓట్లు ఎక్కువగా వచ్చినా సీట్లు మాత్రం ఏమాత్రం పెరక్కపోగా ఇప్పుడున్నవాటికంటే తగ్గిపోవచ్చని తెలిపారు. తెలంగాణలో బిజెపికి 23 శాతం ఓట్లు... 2 నుండి 4 ఎంపీ సీట్లు వస్తాయని పీపుల్స్ పల్స్ సర్వే వెల్లడించింది. ఇక అధికార కాంగ్రెస్ కూడా అసెంబ్లీ ఎన్నికల కంటే లోక్ సభ ఎన్నికల్లో స్వల్పంగా ఓటింగ్ శాతాన్ని పెంచుకుంటుందని ప్రకటించారు. 40 శాతం ఓట్లతో కాంగ్రెస్ ఏకంగా 8 నుండి 10 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంటుందట.మోదీ హవా, బిజెపి హిందుత్వ పాలిటిక్స్ తెలంగాణలో పెద్దగా పనిచేయబోవని పీపుల్స్ పల్స్ సర్వే ఫలితాలు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికల్లో చావుదెబ్బతిన్న బిఆర్ఎస్ పార్టీకి లోక్ సభ ఎన్నికల్లోనూ పరాభవం తప్పదని పీపుల్స్ సర్వే తేల్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చినన్ని ఓట్లు బిఆర్ఎస్ కు రావని... 6 శాతం కోల్పోతుందని తెలిపారు. మొత్తంగా 31 శాతం ఓట్లతో బిఆర్ఎస్ కేవలం 3 నుండి 5 ఎంపీ సీట్లను మాత్రమే గెలుచుకునే అవకాశం వుందని పీపుల్స్ పల్స్ – సౌత్ ఫస్ట్ సర్వే వెల్లడించింది. తెలంగాణ మహిళల్లో కాంగ్రెస్ పార్టీపై నమ్మకం పెరిగిందని... 47 శాతం మంది ఆ పార్టీకి అనుకూలంగా ఓటేసేందుకు సిద్ధంగా వున్నట్లు సర్వే రిపోర్ట్ ద్వారా తెలుస్తోంది. ఇక పురుషుల్లో 37 శాతం మాత్రమే కాంగ్రెస్ కు మద్దతిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 42, అర్బన్ ప్రాంతాల్లో 37 శాతంమంది ప్రజలు కాంగ్రెస్ కు మద్దతిస్తున్నట్లు పీపుల్స్ పల్స్ సర్వే తేల్చింది.

మూడు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం

మొదటి పేజీ తరువాయి...

ప్రభుత్వంలో కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2004లో కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా, 2006 నుంచి కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పని చేశారు. 2009 ఎన్నికల్లో ఖమ్మం లోక్ సభ నుంచి పోటీ చేసి నామా నాగేశ్వరరావు చేతిలో ఓటమి పాలయ్యారు. సికింద్రాబాద్ మాజీ ఎంపీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్ తనయుడే అనిల్ కుమార్ యాదవ్. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2023లోనూ అదే నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు యత్నించారు. అయితే, పార్టీలో వన్ ఫ్యామిలీ.. వన్ టికెట్ ఫార్ములా అమలుతో ఆ సీటును తండ్రి కోసం త్యాగం చేశారు. యూత్ కాంగ్రెస్ లో చురుగ్గా పని చేసి మంచి గుర్తింపు పొందడంతో రాజ్యసభ ఛాన్స్ దక్కింది. గతంలో బండ ప్రకాష్ రాజీనామా వల్ల ఖాళీ అయిన రాజ్యసభ సీటును వద్దిరాజుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చారు. 2022, మే 24న ఈ పదవికి ఎన్నికైన వద్దిరాజు కేవలం రెండేళ్లే ఎంపీగా కొనసాగడంతో ఆయనకు మరోసారి గులాబీ బాస్ అవకాశం కల్పించారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా వరంగల్ ఈస్ట్ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం బీఆర్ఎస్ లో చేరారు.

లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌పై ఈసీ కసరత్తు

మొదటి పేజీ తరువాయి...

లోక్ సభ ఎన్నికలకు ఎన్నికల తేదీలను ఎన్నికల సంఘం ప్రకటించే అవకాశం ఉంది. 2024 ఏప్రిల్, మే నెలల్లో 18వ లోక్ సభ సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. 2024 ఎన్నికల సన్నాహాల్లో భాగంగా ఇప్పటికే ఈసీఐ అధికారుల బృందం వివిధ రాష్ట్రాల్లో వరుసగా పర్యటిస్తోంది. జమ్మూకశ్మీర్ భద్రతా పరిస్థితి, బలగాల లభ్యత గురించి తెలుసుకోవడానికి ఈసీ అధికారులు మార్చి 8-9 మధ్య ప్రభుత్వ ప్రతినిధులను కలుస్తున్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. లోక్ సభ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించవచ్చా లేదా అని తెలుసుకోవడానికి ఈ నెల 12,13 తేదీల్లో ఈసీ అధికారులు జమ్ముకశ్మీర్లో పర్యటించనున్నారు. అయితే చివరిసారిగా 2019 పార్లమెంట్ ఎన్నికల తేదీలను మార్చి 10న ప్రకటించగా, ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకు ఏడు దశల్లో పోలింగ్ జరగ్గా, మే 23న ఓట్ల లెక్కింపు జరిగింది. అయితే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఇప్పటికే ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. ఇటీవలనే ప్రధాని నరేంద్ర మోడీ బీజేపీ నేతలు దిశానిర్దేశం చేస్తూ ఈ లోక్ సభ ఎన్నికల్లో ఏన్డీఏ 400 సీట్లు సాధించి మూడోసారి అధికారంలోకి రావాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో మోడీ అయోధ్య రామమందిరం ప్రత్యేక ఎజెండా ఎత్తుకోబోతుండగా, కాంగ్రెస్ మాత్రం ఢిల్లీ, మణిపూర్ అల్లర్లు, నిరుద్యోగ సమస్యలను ప్రస్తావిస్తూ జనాల్లో వెళ్లే అవకాశం ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల ముందు ఇండియా కూటమికి వరుసగా షాకులు తగులుతుండటం ఆ నేతలకు మింగుడు పడటం లేదు. ఇక ప్రపంచ నాయకులలో ప్రధాని నరేంద్ర మోడీ విజయవంతమైన నాయకుడు అని , ఇతరులకు భిన్నంగా నిలిచారని కేంద్ర రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ అన్నారు. ఉత్తర్ ప్రదేశ్ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సందర్భంగా వచ్చిన పెట్టుబడుల ప్రతిపాదనలకు లక్నోలో జరిగిన భూమిపూజ కార్యక్రమంలో రాజ్ నాథ్ సింగ్ మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వం, మార్గదర్శకత్వంలో యావత్ భారతదేశం పురోగతి సాధిస్తోందన్నారు.

అమిత్ షాపై కామెంట్స్.. పరువు నష్టం కేసులో రాహుల్‌కు ఊరట

మొదటి పేజీ తరువాయి...

రాజకీయాలకు కట్టుబడి ఉందని ప్రకటిస్తూనే మరో పక్క ఓ హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ఆ పార్టీకి అధ్యక్షుడిగా ఉన్నారంటూ రాహుల్ వ్యాఖ్యానించారు. రాహుల్ వ్యాఖ్యలు చేసిన సమయంలో అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షుడి పదవిలో కొనసాగుతున్నారు. రాహుల్ వ్యాఖ్యలను తప్పుబడుతూ మిశ్రా కోర్టును ఆశ్రయించాడు. ఈ కేసుపై సుల్తాన్ పూర్ కోర్టు మంగళవారం విచారణ జరిపింది. కేసు విచారణకు నేడు రాహుల్ కూడా హాజరయ్యారు. ఈ మేరకు ఇరుపక్ష వాదనలు విన్న న్యాయస్థానం.. రాహుల్‌కు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ సందర్భంగా రాహుల్ న్యాయవాది సంతోష్ పాండే విలేకరులతో మాట్లాడుతూ.. పరువు నష్టం కేసులో రాహుల్ నేడు కోర్టుకు హాజరైనట్లు తెలిపారు. కోర్టు నాయన్ను 30-45 నిమిషాల పాటు విచారించిందన్నారు. తర్వాత రాహుల్ బెయిల్ దరఖాస్తు సమర్పించబడంతో కోర్టు ఆమోదించిందని తెలిపారు. తదుపరి విచారణ తేదీని ఇంకా ప్రకటించలేదని, ఈ కేసులో రాహుల్ నిర్దోషి అని, పరువు నష్టం కలిగించే విధంగా ఆయన ఎలాంటి ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. కాగా రాహుల్ చేపట్టిన భారత్‌జోడో న్యాయ యాత్ర ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లోనే కొనసాగుతుండటం గమనార్హం. నేటి ఉదయం కోర్టుకు హాజరు కావడంతో యాత్ర తాత్కాలికంగా ఆపేశారు. మధ్యాహ్నం మధ్యాహ్నం 2 గంటలకు అమేథీలోని ఫుర్సత్‌గంజ్ నుంచి తిరిగి ప్రారంభం కానుంది.

మళ్లీ రైతుల ఆందోళనలు

మొదటి పేజీ తరువాయి...

దేశ రాజధాని ఢిల్లీకి యాత్ర చేపట్టేందుకు సిద్ధం అయ్యారు. ఈ క్రమంలోనే అటు.. కేంద్ర ప్రభుత్వం కూడా రైతులను ఢిల్లీలోకి అనుమతించకపోవడంతో అన్నదాతలు తమదైన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. రైతులను చెదరగొట్టేందుకు టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లను సెక్యూరిటీ సిబ్బంది ప్రయోగిస్తుండగా.. వాటికి కౌంటర్‌గా తాము కూడా ఏదైనా చేయాలని నిర్ణయించుకున్న రైతులు.. వాటికి అవసరమైన సామాగ్రిని సమకూర్చుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఇనుప కవచాలు, జూట్ బ్యాగులతో మలి విడత ఆందోళనలకు సిద్ధం అయ్యారు. పంటలకు కనీస మద్దతు ధరపై చట్టం చేయడం, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయడం సహా వివిధ రకాల డిమాండ్లను నెరవేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ.. వివిధ రాష్ట్రాల్లోని అన్నదాతలు ఈ నెల 13 వ తేదీన దేశ రాజధాని ఢిల్లీకి మెగా మార్చ్ ప్రారంభించారు. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం రైతులను.. ఢిల్లీ, పంజాబ్, హర్యానా సరిహద్దుల వద్దే నిలిపివేసింది. వారిపై టియర్ గ్యాస్, వాటర్ క్యానన్లు ప్రయోగించడంతో రైతులు అక్కడే కూర్చొని నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కేంద్ర మంత్రుల బృందంతో రైతు సంఘాల నేతలు నిర్వహించిన చర్చల్లో ఎలాంటి పురోగతి లేకపోవడంతో తిరిగి తమ ఆందోళనలను కొనసాగించాలని నిర్ణయించారు.

కరీంనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

మొదటి పేజీ తరువాయి...

సిద్ధమయ్యారు. జాతరకు వెళ్లే ముందు ఇంట్లో దేవుడికి దీపం పెట్టి తాళాలు వేసుకొని బయల్దేరారు. ఆ దీపం గుడిసెలకు అంటుకుని వేగంగా మంటలు వ్యాపించాయి. అందరూ చూస్తుండగానే 10 సిలిండర్లు బ్లాస్ట్ అయ్యాయి. క్షణాల్లో 20 గుడిసెలు అగ్నిప్రమాదంలో దగ్ధమయ్యాయి. స్థానికుల సమాచారం అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. గ్యాస్ సిలిండర్లు పేలడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. భారీ శబ్దాలు రావడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చిన కార్మికులు ఆదర్శనగర్‌లోని ఈ ప్రాంతంలో 20 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. వారంతా కుటుంబాలతో సహా మేడారం జాతరకు వెళ్లడంతో భారీ ప్రాణనష్టం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ఆర్టికల్ 370 రద్దుతో..రాష్ట్రంలో నవ్యపథం

జమ్మూకశ్మీర్, ఫిబ్రవరి, 20 (ప్రభాత ఉదయం): దశాబ్దాల తరబడి వంశపారంపర్య రాజకీయాల భారాన్ని జమ్మూకశ్మీర్ భరించాల్సి వచ్చిందని ప్రధాని మోడీ అన్నారు. ఆ రాజకీయ నేతలు వారి కుటుంబాల గురించి మాత్రమే ఆలోచించేవారని, అయితే ..ఇప్పుడు అలాంటి పరిస్థితుల నుంచి విముక్తి లభిస్తున్నందుకు సంతోషంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. కొన్నేళ్లుగా జమ్ము కశ్మీర్‌ను ఎవరూ పట్టించుకోలేదని.. ఇవాళ ఇక్కడి నుంచి అభివృద్ధి పనుల్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని దేశ ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మంగళవారం జమ్మూ నుంచి ఐఐటీ, ఐఐఎం, నవోదయ లాంటి విద్యాసంస్థలను ప్రారంభించి జాతికి అంకితం చేశారు. జమ్ముకశ్మీర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం. త్వరలో వికసిత్ కశ్మీర్‌కల సాకారం అవుతుంది. మోదీ గ్యారెంటీ అంటే ఇలా ఉంటుంది అని అన్నారు. అభివృద్ధి చెందిన భారత్ అంటే అభివృద్ధి చెందిన జమ్మూకశ్మీర్ కూడా అని తెలిపారు. గత పదేళ్లలో ఈ ప్రాంతంలో కొత్తగా 50 డిగ్రీ కళాశాలలు ఏర్పాటయ్యాయని వెల్లడించారు. అప్పట్లో పాఠశాలలకు నిప్పంటించేవారని, ఇప్పుడు అలంకరిస్తున్నారని అన్నారు. బాలీవుడ్ నటి యామీ గౌతమ్ నటించిన ఆర్టికల్ 370 గురించి ప్రధాని మోదీ ప్రస్తావించారు. మంగళవారం జమ్మూ పర్యటనకు వెళ్లిన ఆయన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ప్రభుత్వ పథకాల లబ్దిదారులతో సంభాషించారు. అలాగే మౌలానా ఆజాద్ స్టేడియంలో నిర్వహించిన సభలోనూ ప్రసంగించారు. ఆర్టికల్ 370పై ఈ వారంలో ఒక సినిమా విడుదల కానుందని విన్నాను. అది మంచి విషయం. ప్రజలు వాస్తవాలు తెలుసుకునేందుకు ఆ చిత్రం ఉపకరించనుంది. జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ఆర్టికల్ 370 ప్రధానమైన అవరోధంగా ఉండేది. దానిని భాజపా తొలగించడంతో ఇప్పుడు ఈ ప్రాంతం సమతుల్యత దిశగా కదులుతోంది. దాని రద్దు తర్వాతే ఇక్కడి ప్రజలు రాజ్యాంగంలో పేర్కొన్న సామాజిక న్యాయాన్ని పొందుతున్నారని మోదీ అన్నారు. అలాగే వారసత్వ రాజకీయాలపైనా విమర్శలు చేశారు. ఈ క్రమంలో జమ్మూ కశ్మీర్‌లో ఈరోజు 32 వేల కోట్ల రూపాయల విలువైన ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బహిరంగ సభలో ప్రసంగిస్తూ కుటుంబ రాజకీయాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. జమ్మూకశ్మీర్ అనేక దశాబ్దాలుగా రాజవంశ రాజకీయాల బాధితురాలిగా ఉందన్నారు. వంశపారంపర్య రాజకీయాలు చేస్తున్న వారు తమ ప్రయోజనాల కోసం మాత్రమే చూసుకున్నారు తప్ప మీ ప్రయోజనాలను పట్టించుకోలేదని పేర్కొన్నారు. వంశపారంపర్య రాజకీయాల వల్ల ఎక్కువగా నష్టపోయింది యువతేనని వెల్లడించారు. తమ కుటుంబం గురించి మాత్రమే ఆలోచించే వ్యక్తులు మీ కుటుంబం గురించి చింతించరని చెప్పారు. ఆర్టికల్ 370ని ప్రధాని మోదీ గోడతో పోల్చారు. ఆ గోడను బీజేపీ ప్రభుత్వం తొలగించిందని చెప్పారు. ఇప్పుడు జమ్మూ కాశ్మీర్ సమతుల్య అభివృద్ధి దిశగా కొనసాగుతోందన్నారు. ఈరోజు వందలాది మంది యువతకు ప్రభుత్వ నియామక పత్రాలు అందజేశామని మోదీ గుర్తు చేశారు. ఈ క్రమంలోనే జమ్మూకశ్మీర్ ఈ వంశపారంపర్య రాజకీయాల నుంచి విముక్తి లభిస్తుందన్న సంతృప్తి ఉందన్నారు. జమ్మూకశ్మీర్‌కు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం భారీ కాన

వ్యవసాయ విశ్వవిద్యాలయంలో
ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

రాజేంద్రనగర్,ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) బంజారా సమాజానికి అత్యంత సంపన్నమైన సంస్కృతి, సంప్రదాయ నేపథ్యం ఉందని మొట్టమొదటి బంజారా మహిళా పైలట్ అజ్మీరా బాబి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం కళాశాల ఆడిటోరియంలో మంగళవారం సంత్ సేవాలాల్ మహారాజ్ 25వ జయంతి ఉత్సవాలను బంజారా విద్యార్థులు ప్రొఫెసర్లు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న అజ్మీరా బాబీ మాట్లాడుతూ.. సేవాలాల్ చూపిన మార్గం ప్రతిఒక్కరికీ ఆదర్శనీయమన్నారు. సేవాలాల్ మహారాజ్ బంజారా కమ్యూనిటీ ప్రజలు అడవిని విడిచిపెట్టినప్పుడు సరైన మార్గంలో నడిపించారు. సేవాలాల్ ఎల్లప్పుడూ తన సమాజంలోని ప్రజలకు విలువల గురించి బోధించి సమాజానికి ఆదర్శంగా నిలిచారన్నారు. సమాజంలోని ప్రజలు కష్టపడి పనిచేసి నిజాయితీగా జీవించాలన్నారు. హింస పాపమని, మత్తు, ధూమపానం శాపం అని హితవు పలికి బంజారా జాతికే కాదు యావత్తు ఇతర కులాలకు ఆదర్శపురుషుడయ్యారదని అన్నారు. సేవాలాల్ మహరాజ్ ఆనాడు బంజార జాతి పరువు ప్రతిష్టల గురించి ముందుగానే ఊహించి అహింససిద్ధాంతానికి పునాది వేసి ఆచరించి చూపారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సింగర్ ఎస్పీ నాయక్, లైవ్ కోఆర్డినేటర్, శాస్త్రవేత్త రమేష్ నాయక్, కళాశాల అసోసియేషన్ డీన్ డాక్టర్ నరేందర్ రెడ్డి, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ గోవర్ధన్, డాక్టర్ సుహాసిని, డాక్టర్ చిన్న నాయక్, ప్రొఫెసర్ రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమస్యలను ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ వివరిస్తున్న ప్రజలు

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తా: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) మైలార్దేవ్పల్లి ,బృదావన్ కాలనీలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ జలమండలి, జిహెచ్ఎంసి, విద్యుత్ అధికారులతో కలిసి పర్యటించి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. కాలనీ లో సీసీ రోడ్స్, డ్రైనేజీ, స్ట్రీట్ లైట్స్ గురించి స్థానికులు ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ద్రుష్టికి తీసుకొచ్చారు, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సంబంధిత అధికారులకు సూచనలు చేస్తూ వెంటనే బస్తిలోని సమస్యలు పరిష్కారి చాలని ఆదేశించారు . ఈ పర్యటనలో మైలార్ దేవుపల్లి డివిజన్ బి ఆర్ ఎస్ అధ్యక్షులు ప్రేమ్ గౌడ్, యూత్ ప్రెసిడెంట్ రఘు యాదవ్, రాము యాదవ్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాచీన వారసత్వ సంపదను
భావి తరాలకు అందిద్దాం
మాజీమంత్రి సబితా రెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) ప్రాచీన వారసత్వ సంపదను భావితరాలకు అందజేయాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ కేంద్రంలో సుమారు 90 లక్షల రూపాయలతో చేపడుతున్న అతిపురాతనమైన మెట్లభావి (కోనేరు) పునరుద్ధరణ పనులను మాజీ మంత్రి ,ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. మహేశ్వరం నియోజకవర్గములో పురాతన,ప్రాచీన కట్టడాలు కనుమరుగు కాకుండా భవిష్యత్తు తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రజాప్రతినిధులు బి ఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పురాతన మెట్ల బావి పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితా రెడ్డి

మధురానగర్‌లో ఘనంగా
శివాజీ జయంతి వేడుకలు

శంషాబాద్, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) తుల్జా భవాని మాత భక్తుడు అపర దేశభక్తుడు వీర శివాజీ జయంతిని మధుర నగర్ కాలనీలో ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ పురపాలక సంఘం పరిధిలోని మధురానగర్ 23వ వార్డులో ప్లే గ్రౌండ్లో ఏర్పాటు చేసిన శివాజీ చిత్రపటానికి పూజలు నిర్వహించి పాలాభిషేకం చేశారు. అన్ని బస్సులలో శోభాయాత్ర నిర్వహించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు శోభాయాత్రలు పాల్గొన్నారు. బస్తీకి చెందిన యువకులు శివాజీ అభిమానులు డీజే ఏర్పాటు చేసి బస్తీల్లో ఊరేగింపు నిర్వహించారు. రాజకీయాలకు అతీతంగా యువకులందరూ సంఘటితమై నిర్వహించిన శోభాయాత్ర విజయవంతం కావడం పట్ల కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేశారు. శివాజీ నీ అందరూ ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు.

నేడు విద్యుత్ లేని ప్రాంతాలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో బుధవారం వివిధ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ హతి రామ్ తెలిపారు. ప్లీజ్ సబ్ స్టేషన్ పరిధిలో 11 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఖయ్యూంనగర్ ,జలాల్ బాబా నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు .విద్యుత్ వినియోగదారులు ఈ అంతరాయానికి సహకరించగలరని ఆయన కోరారు.



గ్రేటర్ సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

విస్తీర్ణ కొలతల ఆధారంగా ఇన్స్పెక్టర్లు పరిశ్రమలకు పన్ను వేయడం లేదు
కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 20 (ప్రభాత ఉదయం) రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో జిహెచ్ఎంసి అధికారులు పరిశ్రమలకు విస్తీర్ణ కొలతలకు ఆధారంగా పన్ను తెలిపారు.మైలర్ లేదని మైలార్దేవ్పల్లి డివిజన్ కార్పొటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి సభ దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం జరిగిన గ్రేటర్ కౌన్సిల్ సమావేశం లో తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తోకల శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... జిహెచ్ఎంసి పరిధిలోని రెవెన్యూ విభాగం అధికారుల పనితీరును ఉద్దేశించి ప్రస్తావించారు పెద్ద పెద్ద ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థల యొక్క ప్లింత్ విస్తీర్ణం కొలతలు చేసి పన్ను విధించాల్సింది పోయి టాక్సిన్స్పెక్టర్లు రూపాయి కారు ఒప్పందంతో పరిశ్రమలకు సరైన టాక్స్ విధించకపోవడంతో పాటు గ్రేటర్ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఏరియాను బట్టీ కాకుండా ఇష్టానుసారంగా వేయడం జరుగుతుందని తెలిపారు.మైలర్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని కాటెడాన్ పరిశ్రమల వాడలో లో అంకిత్ ఫుడ్స్, బాదం ఫుడ్స్, రవి ఫుడ్స్, పయల్ ఫుడ్స్ పరిశ్రమల టాక్స్ అసిస్మెంట్ విధానం లో చాలా తేడాలు వున్నాయని, సరైన సమయంలో మదింపు చేయకుండ , టాక్స్ ఇన్స్పెక్టర్లలు ఉన్న విస్తీర్ణం పై టాక్స్ వేయడం లేదని సవ దృష్టికి తీసుకెళ్లారు క సరైన టాక్స్ వేయకుండ మామూలు టాక్స్ వేయడం జరుగుతుందని తెలియచేశారు. ఇంజనీర్ సెక్షన్ లో పెండింగ్ వున్న కాంట్రాక్టర్ కు చెల్లించాల్సిన బిల్స్ సకలంలో విడుదల చేయాలని మేయర్ విజయలక్ష్మి కోరారు .



ఎందరో త్యాగాల ప్రతిఫలం
నేటి మన తెలంగాణ రాష్ట్రం
నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్

కూకట్‌పల్లి,ఫిబ్రవరి20 (ప్రభాత ఉదయం) సిరిపురం యాదయ్య వర్ధంతిని పురస్కరించుకొని శేరిలింగంపల్లి కాంగ్రేస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వి.జగదీశ్వర్ గౌడ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టీపీసీసీ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమంలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు తలపెట్టిన ఛలో అసెంబ్లీ కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకుంటున్న దృశ్యాలను టీవీలో చూసి చలించిపోయి, ఎలాగైనా ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలనే కృతనిశ్చయంతో తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను ఒంటిపై పోసుకొని నిప్పంటించుకొని జై తెలంగాణ అంటూ నినదిస్తూ పోలీసులపైకి పరుగెత్తిన ధీరుడు సిరిపురం యాదయ్య అని, తానొక అగ్నికణమై తెలంగాణ ఉద్యమ మహాయజ్ఞంలో హవిస్సుగామారి తెలంగాణ స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో చెరిగిపోని ముద్ర వేసిన మహనీయుడి ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు,నాయకులు,ఉద్యమకారులు,అభిమానులు పాల్గొని ఘనమైన నివాళులు అర్పించారు.

ప్రారంభానికి సిద్ధమైన
శ్రీ శ్రీ బంగారు మైసమ్మ మహాకాళి దేవాలయం
ఈనెల 24 న ప్రారంభం కానున్న విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమాలు

చార్మినార్, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) పాతబస్తీ రామ్ సింగ్ బాడ లోగల శ్రీ శ్రీ బంగారు మైసమ్మ మహాకాళి దేవాలయంలో విగ్రహ పున ప్రతిష్ట మహా కుంభాభిషేకం కార్యక్రమాలు ఈనెల 24 నుండి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. శ్రీశ్రీశ్రీ జగద్గురు ఆదిశంకరాచార్య ఎంపి వీరుపాక్ష విద్యారణ్య పీఠాధి ఈశ్వరుల చేతుల మీదుగా ఈ మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని కమిటీ ప్రతినిధులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకోవాలని వారు కోరారు.

ప్రజాపాలనను ఓర్వలేకనే
కాంగ్రెస్‌పై బురదచల్లే ప్రయత్నం
కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్

కూకట్‌పల్లి,ఫిబ్రవరి20 (ప్రభాత ఉదయం) ప్రజా పాలనను చూసి ఓర్వలేక నిప్పులు కక్కుతున్న ఎమ్మెల్యే గాంధీ సోమవారం నాడు జరిగిన నగర కౌన్సిల్ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే అభివృద్ధి నిధులపై కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులు కక్కడం చూస్తే గుమ్మడికాయ దొంగ కథ గుర్తుకొస్తుందని 124 డివిజన్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పట్వారి శశిధర్ అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన స్పందిస్తూ అభివృద్ధి అస్తవ్యస్థంగా ఉండడానికి కారణం గత పది సంవత్సరాలుగా శేరిలింగంపల్లికి తాను ఎమ్మెల్యేగా ఉండడమే అనేది ప్రజలకు కొట్టొచ్చినట్టు కనిపిస్తోందని, 10 సంవత్సరాలు ఆయనకు చేతగాని పనిని కప్పిపుచ్చడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పై బురదజల్లే ప్రయత్నం చేయడం చూస్తుంటే హాస్యాస్పదంగా ఉంది. ప్రభుత్వం వచ్చిన 50 రోజుల్లో నే ప్రభుత్వ పని తీరును చూసి ప్రజల్లో ప్రజాపాలన స్పందనను చూసి ఎమ్మెల్యే గుండెల్లో గుబులు పుట్టుకొచ్చింది. డివిజన్ కి సంబంధం లేని నాయకులు అని వక్రీకరిస్తూ మాట్లాడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. మా నాయకుడు పేద ధనికులు అని తేడా లేకుండా అందరినీ దగ్గర తీసుకొని ప్రజల సమస్యను పరిష్కరించే దిశగా అడుగులు వెస్తుండడం చూసి ఓర్వలేక నోరు పారేసుకుంటే సహించం. పేద ప్రజలను మరియు స్లమ్స్ ని దూరం పెట్టింది ఈ ఎమ్మెల్యేనా? కాదా! అన్నది డివిజన్ ప్రజలకు బాగా తెలుసు.ప్రజలు దొరల పాలన పోయి ప్రజా పాలన వచ్చిందని గట్టిగా విశ్వసిస్తున్నారు. రాబోయే లోక్సభ ఎన్నికల్లో డివిజన్ లో భారీ మెజారిటీ కాంగ్రెస్ కైవసం చేసుకోవడం కాయమని ధీమా వ్యక్తం చేశారు.

100% ఉత్తీర్ణత శాతం పెంచేందుకు
ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 20(ప్రభాత ఉదయం) గట్టు మండలంలో పదవ తరగతి 100% ఉత్తీర్ణత శాతం పెంచేందుకు హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ అన్నారు. మంగళవారం గట్టు ఎంపీడీవో కార్యాలయంలో గట్టు మండలంలోని జడ్.పి.హెచ్.ఎస్, ఎం పి హెచ్ ఎస్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. .. గత ఏడాది పదవ తరగతి ఫలితాలు కన్నా ఈసారి గణనీయంగా 95.5 ఉత్తీర్ణత శాతం పెరగాలన్నారు. జిల్లాలోనే కాక దేశంలోనే అక్షరాస్యతలు తక్కువగా ఉన్న గట్టు మండలాన్ని అక్షరాస్యత పెంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆధ్వర్యంలో గ్రామాలకు వెళ్లి పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులకు నచ్చజెప్పి వచ్చే 18 రోజులలో తప్పక పాఠశాలకు హాజరయ్యేలా చూడాలన్నారు. వచ్చే నెల 18న పరీక్షలు ఉన్నందున ఇప్పటినుండే వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. వచ్చే మే మాసం నుండి బ్రిడ్జి కోర్స్ నిర్వహిస్తూ విద్యార్థులను విద్యపై ఆసక్తి కలిగేలా చేస్తామన్నారు. మన ఊరు మనబడి కార్యక్రమం కింద అన్ని పాఠశాలల్లో వసతులు కల్పించడం జరిగిందని డిజిటల్ క్లాసులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. యుడైస్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు విద్యార్థుల హాజరు చూస్తామన్నారు. ప్రతి ఒక్కరు పరీక్ష రాసేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని చాగదోన, మాచర్ల, ఇందువాసి, బోయలగూడెం, ఆలూరు జడ్ పి టి సి హైస్కూల్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పరీక్షలు రాయించాలన్నారు. పదవ తరగతి పరీక్ష ఫలితాలు ఈసారి గణనీయంగా పెరగాలని తాను గట్టు మండలం పై ప్రత్యేక దృష్టి సారించి అక్షరాస్యతా శాతం పెంచేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులు గైర్హాజరు కాకుండా తప్పక విధులు నిర్వహించి పరీక్షలు నిర్వహించాలని నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా హాజరుకానిపక్షంలో వారికి సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి గ్రామాలలో ప్రత్యేక టీమ్లు ఏర్పాటు చేసి ప్రతి విద్యార్థి పాఠశాలకు హాజరయ్యాలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో డిఈఓ ఇంచార్జి ఇందిర, ప్రత్యేక అధికారి ప్రియాంక, తాసిల్దార్ సరితా రాణి, ఎంపీడీవో చెన్నయ్య, ఎంఈఓ కొండారెడ్డి, పాఠశాలల హెడ్మాస్టర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాలుగో టెస్ట్‌కు టీమిండియా సన్నద్ధం

బూమ్రాకు విశ్రాంతిని ఇచ్చే యోచన

ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టుకు భారత జట్టులో రెండు మార్పులు జరుగనున్నాయి. ఈనెల 23న రాంచిలో ప్రారంభమయ్యే మ్యాచ్‌లో ప్రధాన పేసర్ జస్‌ప్రీత్ బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశముంది. అయిదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లో బుమ్రా అత్యధిక వికెట్ల (17)తో సత్తాచాటాడు. రెండో టెస్టులో ఒంటిచేత్తో జట్టుకు విజయాన్ని అందించాడు. గాయం కారణంగా రెండు, మూడు టెస్టులకు దూరమైన కేఎల్ రాహుల్ నాలుగో మ్యాచ్‌కు అందుబాటులో ఉండనున్నాడు. 'భారత జట్టు మంగళవారం రాంచి బయల్దేరింది. బుమ్రాకు విశ్రాంతినిచ్చే అవకాశముంది. రాహుల్ మ్యాచ్ ఫిట్‌నెస్ సాధిస్తున్నాడు. రాంచి టెస్టుకు అతను అందుబాటులో ఉండొచ్చు' అని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.

బౌలింగ్ భారంతో బ్యాటింగ్‌లో విఫలం

జోరూట్ వైఫల్యంపై మార్క్ బుచర్

బౌలింగ్ భారం పెంచడం వల్లే జోరూట్ బ్యాటింగ్‌లో విఫలమవు తున్నాడని ఇంగ్లాండ్ మాజీ క్రికెటర్ మార్క్ బుచర్ అభిప్రాయపడ్డాడు. భారత్‌తో జరుగుతున్న టెస్టు సిరీస్ లో రూట్ ఇప్పటివరకు ఆరు ఇన్నింగ్స్‌ల్లో కేవలం 77 పరుగులే సాధించాడు. 100 ఓవర్లకు పైగా బౌలింగ్ చేశాడు. అత్యుత్తమ బ్యాటర్‌ను ఆల్‌రౌండర్‌గా మార్చి ప్రధాన బౌలర్ల కంటే ఎక్కువ ఓవర్లు వేయించినపుడు బ్యాటింగ్‌లో అతడు విఫలమైతే ఆశ్చర్యపోకండి. ఫాస్ట్ పిచ్‌లపై ఆడేటప్పుడు ఇంగ్లాండ్‌కు జోరూట్ రూపంలో ఒక్క స్పిన్నర్ ఉంటే చాలు అని ఒకప్పుడు కొందరు మాట్లాడారు. అప్పుడు సైతం నేను ఖండించాను. ఒక బ్యాటర్‌పై బౌలింగ్ భారం ఎక్కువగా పడితే బ్యాట్‌తో ఆశించిన ఫలితాలు రావు' అని మార్క్ బుచర్ అన్నాడు. ఈ సిరీస్‌లో టాస్ ఎక్కువగా భారత్‌కే అనుకూలించిందని, మొదట బౌలింగ్ చేయాల్సి వచ్చినపుడు మరింత మెరుగైన బౌలర్లు ఉండాలన్నాడు. 'ప్రధాన స్పిన్నర్ జాక్ లీచ్ గాయంతో వైదొలిగాడు. భారత్‌లో స్పిన్‌కు సహకరించే పిచ్‌లపై అనుభవజ్ఞుడైన స్పిన్నర్ లేకుండా ఆడటం మూర్ఖత్వమే. రెహాన్ అహ్మద్, హార్ట్‌లీ బాగా ఆడారు. కానీ బౌలింగ్ చేసే సమయంలో రెండో, నాలుగో ఇన్నింగ్స్‌లో మాత్రమే కాకుండా మొదటి, మూడో ఇన్నింగ్స్‌లోనూ ప్రభావం చూపాలి. జోరూట్ లాంటి పార్ట్‌టైం స్పిన్నర్‌కు ప్రధాన స్పిన్ బాధ్యతలు అప్పగిస్తే నష్టపోతాం. ఈ సిరీస్‌లో భారత్ ఫెవరెట్‌గా మారడానికి ఇదే ప్రధాన కారణం' అని అన్నాడు. పార్ట్‌టైమ్ స్పిన్నరైన రూట్‌కు భారత్‌లో మెరుగైన బౌలింగ్ రికార్డు ఉంది. ఇంగ్లాండ్ బౌలింగ్ లైన్‌అప్‌లో అనుభవలేమి వల్ల కెప్టెన్ స్టోక్స్ అతడిపై ఎక్కువగా ఆధారపడుతున్నాడు. హైదరాబాద్‌లో జరిగిన మొదటి టెస్టులో 5 వికెట్లు పడగొట్టి ఇంగ్లాండ్ విజయంలో జోరూట్ కీలక పాత్ర పోషించాడు.

యశస్వి జైస్వాల్ 'పుల్' షాట్‌కు ఓ ప్రత్యేకత

చిన్ననాటి కోచ్ ఆరిఫ్ హుస్సేన్ వ్యాఖ్య

టీమ్ ఇండియా యువ సంచలనం యశస్వి జైస్వాల్ అమ్ములపొదిలోని 'పుల్' షాట్‌కు ఓ ప్రత్యేకత ఉందని అతడి చిన్ననాటి కోచ్ ఆరిఫ్ హుస్సేన్ వ్యాఖ్యానించాడు. ఈ సందర్భంగా అతడికి సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించాడు. 'యశస్వి లో ఏదో ప్రత్యేకత ఉందని మేం బలంగా నమ్మేవాళ్లం. దీంతో అతడి ప్రతిభకు పదునుపెట్టాలని భావించి ముంబయికి తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. అతడికి ప్రయాణ ఖర్చులు, శిక్షణను అందించాం. ఆ ఫలితాలు ఇప్పుడు మన కళ్ల ముందు కనిపిస్తున్నాయి. అతడు చురుకైన ఆటగాడని మొదట్లోనే గుర్తించాం. 2007-08లో నా అకాడమీలో చేర్చుకొన్నాను. ఏడాదిలోపే సీనియర్ జట్టులో స్థానం సాధించాడు. అక్కడ అన్ని అవకాశాలను అందించాం' అని వివరించాడు. యశస్విని తీర్చిదిద్దడంలో ముంబయి క్రికెట్ అసోసియేషన్ పాత్ర చాలా ఉందని ఆరిఫ్ వెల్లడించాడు. 'నేడు అతడు ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాడు. దీనిని కొనసాగిస్తాడని ఆశిస్తున్నాను. మొదట్లో చాలా శ్రద్ధగా కృషి చేసి చాలా అంశాలు నేర్చుకొన్నాడు. నాయకత్వ లక్షణాలు చూపాడు. జైస్వాల్‌లో ఏదో ప్రత్యేకత ఉంది. ఎన్నడూ భయపడి వెనక్కి తగ్గలేదు. అతడికి 'పుల్' ఫ్యామిలీ షాట్ వంటిది. దీనికి కారణం అతని సోదరుడు తేజస్వి దీనిని అద్భుతంగా ఆడతాడు. ఈ యువ ఆటగాడు కూడా త్వరలోనే ఉన్నత శిఖరాలకు చేరుకొంటాడని ఆశిస్తున్నా' అని సగర్వంగా చెప్పాడు. యశస్వి టెస్ట్ కెరీర్‌ను ఘనంగా మొదలుపెట్టాడు. ఏడు మ్యాచ్‌ల్లో 861 పరుగులు సాధించాడు. వీటిల్లో రెండు ద్విశతకాలు, ఒక శతకం, రెండు అర్ధ శతకాలు ఉన్నాయి. ఇక ఇంగ్లాండ్‌పై స్వదేశంలో చెలరేగిపోయాడు. కేవలం ఆరు ఇన్నింగ్స్‌ల్లో 545 పరుగులు చేశాడు. రెండు డబుల్ సెంచరీలూ ఈ సిరీస్‌లో సాధించనవే. అంతేకాదు ఇటీవల 12 సిక్సర్ల సాయంతో చేసిన 214

పరుగులతో వసీం అక్రం రికార్డును సమం చేశాడు. జైస్వాల్‌ను పాక్ దిగ్గజ స్పిన్నర్ డానిష్ కనేరియా పొగడ్తలతో ముంచెత్తాడు. అతడు తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ 'గంగూలీ, సెహ్వాగ్ ప్రతిభను కలబోసినట్లు యశస్వి ఆటతీరు ఉంటుంది. వీరూ లెఫ్ట్‌హ్యాండ్ వెర్షన్‌ను చూసినట్లనిపిస్తుంది. ప్రపంచంలోనే అత్యుత్తమ సీమర్లలో అండర్సన్ ఒకడు. దాదాపు 700 వికెట్లు సాధించాడు. అలాంటి ఆటగాడు వేసిన ఉచ్చును ఈ కుర్రాడు వెంటనే గ్రహించాడు. దానిని పూర్తిగా ధ్వంసం చేశాడు' అని అన్నాడు. మరో యువ ఆటగాడు సర్ఫరాజ్ ఖాన్ కూడా అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొన్నాడని డానిష్ అభిప్రాయపడ్డాడు. తాను చూసిన ఉత్తమ ఇన్నింగ్స్‌ల్లో అతడిది కూడా ఒకటని పేర్కొన్నాడు.

కోహ్లీని వదలని డీప్ ఫేక్ భూతం

బెట్టింగ్ యాప్‌ను ప్రచారం చేస్తున్నట్టుగా వైరల్

డీప్‌ఫేక్ ఫొటోలు, వీడియోల కట్టడికి ఓ వైపు కేంద్రం, మరోవైపు సామాజిక మాధ్యమ సంస్థలు చర్యలు చేపడుతున్నా.. నకిలీల బెడద తప్పట్లేదు. తాజాగా టీమ్‌ఇండియా మాజీ సారథి, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ కి సంబంధించిన డీప్‌ఫేక్ వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. ఓ బెట్టింగ్ యాప్‌ను అతడు ప్రచారం చేస్తున్నట్లు అందులో ఉండటం గమనార్హం. ప్రముఖ టీవీ ఛానల్ లైవ్ న్యూస్ కార్యక్రమంలో కోహ్లీ యాడ్‌ను ప్రసారం చేసినట్లు సైబర్ కేటుగాళ్లు ఈ వీడియోను సృష్టించారు. గతంలో కోహ్లీ ఇచ్చిన ఓ ఇంటర్వ్యూకు సంబంధించిన వీడియో క్లిప్‌ను మార్ఫింగ్ చేసి.. బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తున్నట్లు రూపొందించారు. తక్కువ పెట్టుబడితో సులువుగా ఎక్కువ డబ్బులు ఎలా సంపాదించవచ్చో క్రికెటర్ చెబుతున్నట్లుగా అందులో ఉంది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతుండగా.. అది నకిలీదని పలువురు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. దీనిపై కోహ్లీ ఇంకా స్పందించలేదు. ఈ మధ్యకాలంలో సెలబ్రిటీల డీప్‌ఫేక్ వీడియోలు తీవ్ర కలకలం రేపుతున్న విషయం తెలిసిందే. ఇటీవల క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ కూడా ఓ గేమింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తున్నట్లు నకిలీ వీడియో వైరల్ అవగా, దాన్ని ఆయన ఖండించారు. వీడియోలో ఉన్నది తాను కాదంటూ స్పష్టతనిచ్చారు. టెక్నాలజీని ఇలా విచ్చలవిడిగా దుర్వినియోగం చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఇలాంటి వీడియోలు, ప్రకటనలు, యాప్‌లు ఎక్కడ కన్పించినా వెంటనే సంబంధిత అధికారులకు రిపోర్ట్ చేయండి. సామాజిక మాధ్యమాలు అప్రమత్తంగా ఉంటూ ఈ ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి. నకిలీ సమాచారం, డీప్‌ఫేక్ వీడియోల వ్యాప్తిని అరికట్టేందుకు త్వరితగతిన చర్యలు తీసుకోవడం అత్యవసరం అని సచిన్ పోస్ట్ చేశారు. అంతకుముందు సచిన్ కుమార్తె సారా తెందూల్కర్ డీప్‌ఫేక్ ఫొటోలు కూడా వైరల్ అయ్యాయి. ఇక సినీ తారలు రష్మిక, కత్రినాకైఫ్ మార్ఫింగ్ వీడియోలు కలకలం సృష్టించాయి. దీన్ని కేంద్రం తీవ్రంగా పరిగణించింది. అవసరమైతే ఇందుకోసం కొత్త చట్టం తీసుకొస్తామని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ వెల్లడించారు.

బెన్‌స్టోక్స్ వస్తే బౌలింగ్ రాటుదేలుతుంది

ఇంగ్లాండ్ కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్

టీమ్‌ఇండియాతో జరిగే చివరి రెండు టెస్టుల్లో బెన్ స్టోక్స్ బౌలింగ్ చేస్తే జట్టు మరింత బలంగా మారుతుందని ఇంగ్లాండ్ కోచ్ బ్రెండన్ మెక్‌కల్లమ్ అన్నాడు. కానీ సవాళ్లతో కూడిన ఉపఖండ పిచ్‌లపై అతడు బౌలింగ్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడని అనుకోవడంలేదన్నాడు. గతేడాది స్టోక్స్ మోకాలికి శస్త్ర చికిత్స జరిగింది. దీని నుంచి పూర్తిగా కోలుకునేందుకు తాత్కాలికంగా బౌలింగ్‌కు విరామం ఇచ్చాడు. గత మూడు టెస్టుల్లో ఆ లోటు స్పష్టంగా కనిపించింది. రాంచిలో జరగనున్న నాలుగో టెస్టుకు ముందు పిచ్ పరిస్థితి అంచనా వేసిన తర్వాతే స్టోక్స్ బౌలింగ్ చేయడంపై, తుది జట్టు ఎంపికపై నిర్ణయానికి వస్తామని మెకల్లమ్ తెలిపాడు. బెన్ స్టోక్స్ బౌలింగ్‌కు అందుబాటులో ఉంటే జట్టు మరింత బలంగా మారుతుంది. అతడు చాలా తెలివైనవాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శన చేయగలిగే ఫిట్‌నెస్ ఉండి ఎక్కువ ఓవర్లు వేసేలా శరీరం సహకరిస్తేనే అతడు బౌలింగ్‌కు దిగుతాడు. రాంచీ పిచ్‌ను అంచనా వేసిన తర్వాత తుది జట్టు ఎంపిక ఉంటుంది. ఒలి రాబిన్‌సన్ , అట్కిన్‌సన్ లాంటి ఆటగాళ్లతో మాకు బౌలింగ్ ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. నాలుగో టెస్టుకు స్పిన్ పిచ్‌ను సిద్ధం చేస్తారని అనుకుంటున్నాను. ఇప్పుడున్న జట్టుతో సంతృప్తిగా ఉన్నాం. గత మూడు టెస్టుల్లో మా ఆటగాళ్లు మంచి ప్రదర్శనే చేశారు. చివరి రెండు టెస్టుల్లో తిరిగి పుంజుకుంటాం' అని అన్నాడు. మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 2-1తో ముందంజలో నిలిచింది. వరుస ఓటములతో వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ ర్యాంకులో ఇంగ్లాండ్ ఎనమిదో స్థానానికి పడిపోయింది. స్వదేశంలోని లార్డ్స్ మైదానంలో వచ్చే ఏడాది జరగనున్న ఫైనల్లో ఆడాలనుకుంటే ఆ జట్టు తిరిగి పుంజుకోవాల్సిందే.

నేడు గోవాలో నటి రకుల్ పెళ్లి

హాజరు కానున్న పలువురు ప్రముఖులు

గత రెండేళ్లలో బాలీవుడ్‌లో ఎన్నో సెలబ్రిటీల పెళ్లిళ్లు జరిగాయి. ఇక ఇప్పుడు రకుల్ ప్రీత్ సింగ్ కూడా ఆ జాబితాలో చేరనుంది. హీరో, ప్రొడ్యూసర్ అయిన జాకీ భగ్నానీని రకుల్ ప్రేమించి పెళ్లి చేసుకోనుంది. ఫిబ్రవరి 21న గోవాలో రకుల్, జాకీ డెస్టినేషన్ వెడ్డింగ్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇక దానికోసం రెండు రోజుల ముందే అక్కడికి చేరుకు న్నారు. రకుల్, జాకీ.. ఇద్దరికీ బాలీవుడ్‌లో మంచి గుర్తిం పు ఉంది. అందుకే హిందీ సినీ పరిశ్రమలో వీరిద్దరికీ క్లోజ్ అయిన నటీనటులు ఈ వివాహానికి హాజరు కానున్నారు. అంతే కాకుండా ఒక సీనియర్ నటి ఈ పెళ్లిలో డ్యాన్స్ చేయడంతో పాటు తనకు కాబోయే భార్య రకుల్‌కు ఒక స్పెషల్ సర్‌ప్రైజ్‌ను కూడా ప్లాన్ చేశాడట జాకీ. రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ మూడేళ్ల క్రితం తమ ప్రేమ గురించి సోషల్ మీడియాలో ప్రకటించారు. అప్పటినుండి వీరి పెళ్లి ఎప్పుడా అని ఫ్యాన్స్ ఎదురు చూస్తున్నారు. చివరగా గోవాలో వీరి డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుంది అని రూమర్ మొదలయ్యింది. అది రూమర్ కాదు.. నిజమే అని కన్ఫర్మ్ అయ్యింది. ఇక ఈ పెళ్లిలో తనకు కాబోయే భార్య రకుల్‌కు స్పెషల్ సర్‌ప్రైజ్‌ను ఎ÷-లాన్ చేశాడట జాకీ భగ్నానీ. అక్కడ తన కోసం పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నాడని సమాచారం. వారి లవ్ స్టోరీపై ఒక ప్రత్యేకంగా పాటను రాయించాడట జాకీ. మయూర్ పూరీ అనే రైటర్‌తో రకుల్, తన ప్రేమకథను 'బిన్ తేరే' అనే పాటను తయారు చేయించాడట. ఈ పాటపై పెళ్లిలో జాకీ స్పెషల్ పెర్ఫార్మెన్స్ ఉంటుందని సమాచారం. బిన్ తేరే' పాటకు తనిష్క్ బాగ్చీ సంగీతాన్ని అందించగా.. జాహ్రాహ్ ఎస్ ఖాన్, రోమీలతో పాటు జాకీ స్వయంగా దీనిని పాడాడు. 'రకుల్ కోసం రాయించిన ఈ పాట కోసం జాకీ తన ప్రాణం పెట్టాడు. ఇది పెళ్లిలో ముఖ్యమైన ఘట్టం కానుంది. తనకు గుర్తుండిపోయే గిఫ్ట్ ఇవ్వాలనే ఆలోచనతో ఈ ఐడియాతో ముందుకొచ్చాడు. ఈ పాట వారి ప్రేమకథను సెలబ్రేట్ చేసే విధంగా ఉంటుంది' అని జాకీ సన్నిహితులు రివీల్ చేశారు. దీంతో పాటు పెళ్లికి వచ్చిన గెస్టులకు కూడా స్పెషల్ పర్ఫార్మెన్స్‌లు ఉండనున్నాయి. సీనియర్ నటి శిల్పా శెట్టి.. తన భర్త రాజ్ కుంద్రాతో కలిసి రకుల్, జాకీల పెళ్లిలో పెర్ఫార్మ్ చేయనున్నట్టు సమాచారం. లక్ష్మి మంచు, ప్రగ్యా జైస్వాల్, అజయ్ దేవగన్.. ఇలా ఎందరో సెలబ్రిటీలు రకుల్, జాకీల పెళ్లిలో సందడి చేయనున్నారు. పెళ్లి పనుల కోసం గోవాకు బయల్దేరే ముందు ముంబాయ్‌లోని సిద్ధి వినాయకుడి ఆలయాన్ని సందర్శించుకుంది ఈ జంట. దానికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి కూడా. 2021లో ముందుగా వీరి ప్రేమ గురించి బయటపెట్టారు రకుల్, జాకీ. అప్పటినుండి ఇప్పటివరకు వీరు పెద్దగా బయట కలిసి కనిపించకపోయినా.. సందర్భం వచ్చినప్పుడల్లా సోషల్ మీడియాలో ఒకరిపై మరొకరికి ఉన్న ప్రేమను బయటపెడుతూనే ఉన్నారు. గోవాలో జరగనున్న డెస్టినేషన్ వెడ్డింగ్‌లో కొందరు సినీ సెలబ్రిటీలతో పాటు ఇరువురి కుటుంబ సభ్యులు పాల్గొనున్నారు.

పాత జ్ఞాపకాలు అమోఘం

బికినీ ఫోటోలను విడుదల చేసిన ఇలియానా



గోవా బ్యూటీ ఇలియానాకు బీచ్ అన్నా, బాత్ టబ్ అన్నా ప్రాణం. కుదిరితే బీచ్ దగ్గర విహరిస్తుంటుంది. లేదా ఇంట్లో ఉన్న బాత్ టబ్‌నే బీచ్ గా భావిస్తూ నీటితో ఆడుతుంటుంది. కెరీర్ బిగినింగ్ నుంచి జీరో సైజ్ బాడీని మెయినటెన్ చేస్తున్న కథానాయిక ఈమె. గతేడాది ఆగస్ట్ ఒకటో తేదీని ఆమె పండంటి

మగబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం అమ్మతనాన్ని ఆస్వాదిస్తోంది. తాజాగా ఇలియానా పోస్ట్ చేసిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతోంది. ఆమె గర్భవతిగా ఉన్న సమయంలో బికినీ ధరించి బాత్రూమ్‌లో దిగిన ఫొటో ఒకటి ఇన్స్టాలో షేర్ చేసింది. ఈ మిర్రర్ సెల్ఫీ బ్లాక్ అండ్ వైట్‌లో ఉండటం విశేషం. బ్లాక్ బికినీలో ఓ చేత్తో తన బేబీ బంప్‌ను చూపిస్తూ సెల్ఫీ దిగింది. 'ఏడాది కిందట. నాలుగు నెలల ప్రెగ్నెంట్‌గా ఉన్న సమయంలో ఇలా' అనే క్యాప్షన్‌తో ఇలియానా ఈ ఫొటో షేర్ చేసింది. ప్రస్తుతం ఈ ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం తన పార్టనర్‌తో అమెరికాలో ఉన్న ఆమె గర్భవతిగా ఉన్నప్పటి ఫొటోలు చూసుకుంటూ ఆ జ్ఞాపకాలను నెమరువేసుకుంటోంది. ఆమె ఈ మధ్య తన పార్ట్‌నర్ మైఖేల్ డోలాన్‌తో కలిసి వాలెంటైన్స్ డే సెలబ్రేట్ చేసుకుంది. ప్రస్తుతం ఇలియానా హిందీలో రెండు చిత్రాల్లో నటిస్తోంది.

బాబు నెం1 బుల్ షిట్ గయ్

8న విడుదలకు సన్నాహాలు

బిగ్ బాస్ ఫేం, యంగ్ ట్యాలెంటెడ్ అర్జున్ కళ్యాణ్, కుషితకల్లపు హీరో హీరోయిన్స్‌గా లక్ష్మణ వర్మ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బాబు నెం1 బుల్ షిట్ గయ్'. డీడీ క్రియేషన్స్ బ్యానర్ పై దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రం ప్రమోషనల్ కంటెంట్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మార్చి 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ సందర్భంగా ఈ చిత్రం ట్రైలర్ ను బేబీ చిత్ర నిర్మాత ఎస్. కె. ఎన్ , దర్శకుడు సాయిరాజేష్, నిర్మాత వివేక్ కూచిభొట్ల విడుదల చేశారు. సాయిరాజేష్ మాట్లాడుతూ 'ఈ సినిమా ట్రైలర్ అద్భుతంగా అనిపించింది. ఒకే ట్రైలర్ లో విభిన్న ఎమోషన్స్ ని చూపించడం బావుంది. సినిమాకి చాలా మంచి పాజిటివ్ బజ్ వుంది. అర్జున్ కళ్యాణ్ లో ఎప్పుడ్గూ ÷ర్ తో ఉంటాడు. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని కోరారు. హీరో అర్జున్ కళ్యాణ్ మాట్లాడుతూ : యూనిక్ కాన్సెప్ట్ తో థ్రిల్లర్, డ్రామాగా రూపొందిన చిత్రమిది. చాలా కష్టపడి మూడు భాషల్లో ఈ సినిమా చేశాం. ఈ ప్రాజెక్ట్ నెక్స్ట్ లెవల్ కి తీసుకెళుతుందని నమ్ముతున్న. చాలా డిఫరెంట్ గా చేశాం. ప్రేక్షకుల తప్పకుండా ఆదరించాలి' అని అన్నారు. అర్జున్ కళ్యాణ్, కుషితకల్లపు చాలా హార్డ్ వర్క్ చేశారు. మంచి సినిమా అవుతుందని దర్శకుడు లక్ష్మణ వర్మ అన్నారు.

ఫర్హాన్ అక్తర్ డాన్ 3లో కియారా

రామ్ చరణ్ తో 'గేమ్ చెంజర్' సినిమా చేస్తున్న బాలీవుడ్ నటి కియారా అద్వానీ ఇప్పుడు మరో పెద్ద ఛాన్స్ కొట్టేసింది. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ తీయబోయే 'డాన్ 3' సినిమాలో కియారా అద్వానీ చేస్తున్నట్టుగా అధికారికంగా ప్రకటన వచ్చింది. ఇందులో రణవీర్ సింగ్ కథానాయకుడిగా నటిస్తుండగా, అతనికి జోడీగా కియారా అద్వానీ చేస్తున్నట్టుగా చిత్ర నిర్వాహకులు ప్రకటించారు. ఇది ఇంతకు ముందు తీసిన 'డాన్' సినిమాకి రెండో సీక్వెల్ గా రావటం విశేషం. దర్శకుడు ఫర్హాన్ అక్తర్ సామాజిక మాధ్యమం ద్వారా ఈ విషయాన్ని చెపుతూ, మా డాన్ యూనివర్స్‌కి స్వాగతం అంటూ కియారా అద్వానీ కి చెప్పారు. కియారా మొదటిసారిగా రణవీర్‌సింగ్‌తో ఈ సినిమాలో నటిస్తున్నారు, ఇంతకు ముందు ఆమె రణవీర్ సింగ్ తో చెయ్యలేదు. ఇంతకు ముందు వచ్చిన రెండు సినిమాలలో షా రుఖ్ ఖాన్, ప్రియాంక చోప్రా నటించారు, ఇప్పుడు రణవీర్ సింగ్ ఈ మూడో సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నారు.ఇది ఒక యాక్షన్ సినిమాగా తెరకెక్కనుందని అంటున్నారు, ఇందులో కియారా అద్వానీ ఒక యాక్షన్ పాత్రలో కనిపించ నున్నారని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, కియారా ఇంకో యాక్షన్ సినిమాలో కూడా నటిస్తున్నారు. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ కలిపి నటిస్తున్న 'వార్ 2'లో కూడా కియారా అద్వానీ కథానాయికగా నటిస్తోంది. ఇంతవరకు యాక్షన్ పాత్రలు చెయ్యని కియారా ఇప్పుడు ఈ 'డాన్ 3', 'వార్ 2' లతో, యాక్షన్ జానర్‌లో కూడా తన ప్రతిభ చూపించుకోవడానికే అవకాశం దక్కింది. అలాగే తెలుగులో 'గేమ్ చెంజర్' లో రామ్ చరణ్ పక్కన నటిస్తోంది. దీనికి శంకర్ దర్శకుడు. ఈ సినిమా తెలుగుతో పాటు అన్ని భాషల్లో విడుదలవుతోంది.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.